క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల పరిశీలన


జానంపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

పెదవేగి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు ఎక్కువ సమయం పనిచేసి అధిక వేతనం పొందాలని పెదవేగి ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. బుధవారం మండలంలోని జానంపేటలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు రూ 272 వరకూ పొందవచ్చని తెలిపారు. పని ప్రదేశానికి అందరూ పనిముట్లతో రావాలన్నారు. ఉపాధి పని జరిగే ప్రాంతంలో కూలీలకు తాగునీరు ప్రాథమిక చికిత్స కిట్‌లు, నీడకోసం టెంట్లు సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇంటర్‌లో జీఎస్ఆర్ పిప్పర విద్యా సంస్థల విజయకేతనం


నాగఫణీంద్ర, ద్వితీయ ఇంటర్ (980)

గణపవరం: బుధవారం రాత్రి వెల్లడించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జీఎస్ఆర్ పిప్పర విద్యా సంస్థలు విజయభేరి మోగించాయని కరస్పాండెంట్ సుధీర్‌కుమార్‌రాజు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 90 శాతం, ద్వితీయ సంవత్సరంలో 92 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ద్వితీయ ఎంపీసీలో ఎం.నాగఫణీంద్ర 980 మార్కులు, టి.రామలక్ష్మి, సుమశ్రీదుర్గకు 967 మార్కులు వచ్చాయని, ద్వితీయ బైపీసీలో పావని సత్యకల్యాణి 957 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నఫీషా 470 మార్కులకు 457 మార్కులు సాధించారని తెలిపారు. గణపవరం చాణక్య జూనియర్ కాలేజి ఇంటర్ ఫలితాల్లో 91శాతం సాధించినట్లు ప్రిన్సిపల్ అడపా సూరిబాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో లోచన 969 మార్కులు, ప్రథమ సంవత్సరంలో 469 అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఉప సర్పంచ్ నరేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే


ఉమా మహేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ నాయకులు, చానమిల్లి ఉపసర్పంచ్ వెజ్జు నరేష్ సతీమణి ఉమామహేశ్వరి ఇటీవల మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే వాసుబాబు వెజ్జు నరేష్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, వైసీపీ మాజీ మండల కన్వీనర్ బేతు రాజశేఖర్ తదితరులున్నారు.

వైభవంగా వార్షికోత్సవం

పెదవేగి : లక్ష్మీపురంలో కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని పరిస్కరించుకొని బుధవారం మహా అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. కోదండ రామాలయం నిర్మించి 24 ఏళ్లు అయిన సందర్భంగా స్వామివారి ఆలయ వార్షికోత్సవాన్ని కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

చోరీలపై కేసు నమోదు

దెందులూరు: మండలంలో రెండు గ్రామాల్లో జరిగిన చోరీలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. దోసపాడులో కిరాణా వ్యాపారం చేసే ప్రత్తిపాటి పద్మరాజు ఇంట్లో జనవరిలో మూడు కాసుల బంగారు నక్లెస్ పోయిందని ఫిర్యాదు చేశారన్నారు. పోతునూరులో సింహాద్రి వాసు ఇంట్లో రెండు సెల్‌ఫోన్లు మంగళవారం చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారన్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గడపగడపకూ సంక్షేమం.. ఇంటింటా సంతోషం


మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: రాష్ట్రంలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలన గడపగడపకూ సంక్షేమ, ఇంటింటా సంతోషం అన్నట్లుగా సాగిందని, మరలా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పర సచివాలయం-2 పరిధిలో వడ్డిగూడెం ప్రాంతంలో నువ్వే మా నమ్మకం జగన్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే కాకుండా దేశ చరిత్రలోనే ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను యజమానుల అనుమతితో ఆయా గృహాలకు అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ కాకర బేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడివీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి దానమ్మ, పార్టీ నాయకులు కాకర్ల శ్యాం, ముత్యాల రాంబాబు, ఇందుకూరి ప్రకాష్‌రాజు, ముగ్గళ్ల అప్పారావు, ఐఎస్ఎన్ రాజు, కొండలరావు, దుర్గారావు పాల్గొన్నారు.

అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి

భీమడోలు: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని, ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకుని వెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పని చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం సమృద్ధి మౌలిక వసతుల కల్పనలో సూరప్పగూడెం రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకుంది. గ్రామ సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు, ఆ శాఖ కమిషనర్ సూర్య కుమారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భువనపల్లిలోని క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే వాసుబాబును సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు, గ్రామ పంచాయతీ అధికారుల బృందం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వాసుబాబును వారిని ప్రత్యేకంగా అభినందించారు. వారికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను వాసుబాబు వారికి అందించారు. రాష్ట్రస్థాయిలో భీమడోలు మండలంలోని సూరప్పగూడెం గ్రామానికి ఉత్తమ పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇంజేటి జూనియర్, గ్రామకార్యదర్శి టి.ముత్తయ్య, వీఆర్వో వెజ్జు నాగేశ్వరరావు, నాయకులు గౌతు రఘు, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన బిషప్ జయరావు, ఫాదర్లు

పెదవేగి : వేసవి మండే ఎండల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని ఏలూరు మేత్రాసన పీఠాధిపతులు పొలిమేర జయరావు అన్నారు. పెదవేగి మండలం పినకడిమిలోని సెయింట్ జాన్స్ మైనర్ సెమినరీ రెక్టర్ ఫాదర్ ఇంటూరి జాకబ్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిషప్ జయరావు పాల్గొన్నారు. ఏలూరు-చింతలపూడి ప్రధాన రహదారి ఎఫ్‌సీసీ గోదాం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బిషప్ ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ, చల్లటి పానీయాలు అందించారు. ఫాదర్లు అమ్మన్నరాజ, చైతన్యరాజు, అనిల్, స్టీఫెన్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం ప్రభుత్వానికి అనుకూలం


ఉంగుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు


ఎమ్మెల్యే వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో దేశిరాజు

ఉంగుటూరు: ప్రజాభిప్రాయం ప్రభుత్వానికి అనుకూలం ఉందని మెగా పీపుల్స్ సర్వే స్పష్టం చేస్తోందని, ఇది పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జగనన్న మా భవిషత్తు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 7న 15 వేల సచివాలయాల్లో మెగా పీపుల్స్ సర్వే ప్రారంభించినట్టు వాసుబాబు తెలిపారు. లక్షల మంది ప్రజల అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో పార్టీ శ్రేణులు, గృహ సారథులు నమోదు చేశారని తెలిపారు. నవరత్నాలు హామీలను నూరు శాతం నెరవేర్చిన జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనేది అర్థమవుతోందని వెల్లడించారు. పథకాలు పొందిన లబ్ధిదారులు ఆనందంగా సీఎం జగన్‌ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సర్వే ద్వారా తెలుస్తోందని వివరించారు. సమావేశంలో మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల కన్వీనర్ పి. బాలకృష్ణ, వీవర్స్ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాలగోపి ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన పశ్చిమగోదావరి జిల్లా అధికారులు

గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా అధికారులు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు వారు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయా శాఖల సమస్యలపై ఆయన చర్చించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలాన్ని ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసిన సంగతి విదితమే. దీనితో ఆ జిల్లా అధికారులు తొలిసారిగా ఎమ్మెల్యేను కలిశారు. భీమవరం ఆర్డీవో దాసిరాజు, జిల్లా పంచాయతీ అధికారి మధుసూధనరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో ధాన్యం కొనుగోలు, గోనె సంచులు, రెవెన్యూ సమస్యలపై వారు ఎమ్మెల్యేతో చర్చించారు.

ఉన్నత పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి

దెందులూరు: గోపన్నపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులందరూ గతంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసి పాఠశాలకు వచ్చేదారి వర్షం వస్తే బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగాఉందని చెప్పారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో కొండేటి నాగే శ్వరరావు ఇంటి నుంచి ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును బుధ వారం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పంచాయతీ కోఆప్షన్ మెంబర్, వైఎస్సార్ సీపీ నేత కామా కుమార్‌బాబు, కార్యదర్శి యహోషువా పరిశీలించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వాసుబాబు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి

ఉంగుటూరు: రాజమహేంద్రవరం వేద స్పైన్ సెంటర్ ఆసుపత్రి డాక్టరు తేజోఫణీంద్ర, డాక్టర్ లక్ష్మీమృదుల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో ఉచితంగా వెన్నుపూస, ఎముకలు, స్త్రీల వైద్యంపై ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచి బండారు సింధు అధ్యక్షత వహించారు. సభలో వాసుబాబు మాట్లాడుతూ వేద స్పైన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేసి పేదలకు ఉపయోగపడటం మంచి పరిణామమన్నారు. వెన్నుపూస వైద్య నిపుణుడు మన ఉంగుటూరు గ్రామ వాసి కావడం గర్వంగా ఉందని వాసుబాబు అన్నారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడమంగరావు, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, తహసీల్దారు వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, గ్రామ కమిటీ నాయకుడు కోరాడ శివ, ఉపసర్పంచి పాతూరి జగదీష్ పాల్గొన్నారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఎముక సాంద్రత పరీక్షలను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో 320 మందికి వైద్య సేవలందించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


అక్కిన సుబ్రహ్మణ్యం (965), సీనియర్ ఇంటర్ | జీ కళ్యాణి (455), జూనియర్ ఇంటర్ | బీ ఇందుమతి (480), మొదటి సంవత్సరం ఒకేషనల్

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ గ్రూపు ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.హేమలత 93.1శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. జే.దేవిశ్రీలక్ష్మి 84.7 శాతం మార్కులు సాధించి బైపీసీలో టాపర్‌గా నిలిచింది. కళాశాల టాపర్‌గా హేమలత నిలిచింది. ప్రథమం సంవత్సరం ఎంపీసీలో అజయరాజు 470కి 452 మార్కులు, ప్రథమ బైపీసీలో జి.హసిని 440కి 385 మార్కులు సాధించింది. సీఈసీలో 27 మందికి 13 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం సీఈసీలో పి.ప్రభావతికి 445 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన గురుకులం

పెదవేగి : ఇంటర్ ఫలితాల్లో పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ ఎస్ భారతి చెప్పారు. బుధవారం వెలువడిన ఫలితాల వివరాలను ఆమె వివరించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థులు 37 మంది పరీక్షకు హాజరవ్వగా ఏ గ్రేడ్ 18, బీ గ్రేడ్ 6, సీ గ్రేడ్ 4, డీ గ్రేడ్ 2 రాగా, ఏడుగురు ఫెయిల్ అయ్యారని తెలిపారు. సీనియర్ బైపీసీలో 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా ఏ గ్రేడ్ 21, బీ గ్రేడ్ 5, సీ గ్రేడ్ 5 రాగా 8 మంది ఫెయిల్ అయ్యారని ప్రిన్సిపాల్ చెప్పారు. మొత్తంగా బైపీసీ, ఎంపీసీల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 55 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. సీనియర్ ఎంపీసీలో మొదటి స్థానంలో వలదాసి డిడియోన్ హడ్సన్ టైలర్ (963), ద్వితీయస్థానంలో గొల్లపల్లి అవినాష్(932), మూడో స్థానంలో మీసాల మణికంఠ (918) నిలిచారు. సీనియర్ బైపీసీలో లక్కపాము కమలాకర్(959), మేరుగు అక్షయ్ కుమార్ (944), నారపాము అకిల్‌బాబు (942) మార్కులు సాధించారు.

965 మార్కులు సాధించిన సుబ్రహ్మణ్యం

పెదపాడు : స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అక్కిన సుబ్రహ్మణ్యం 965 మార్కులు సాధించాడు. మొదటి సంవత్సరం విద్యార్థి జీ కళ్యాణి (455) టాపర్‌గా నిలిచింది. బీ ఇందుమతి మొదటి సంవత్సరం ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో 500కి 480 మార్కులు సాధించింది. ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, అధ్యాపకులతోపాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వారిని అభినందించారు.

పెదపాడు జూనియర్ కళాశాలలో..

స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 69శాతం మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 55శాతం మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరావు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్‌లో 45 మంది పరీక్షకు హాజరవ్వగా 31 మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 47మంది హాజరు కాగా 26 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా శాంతి కల్యాణోత్సవం

భీమడోలు: గుండుగొలనులోని పురాతన సీతా రామస్వామి ఆలయంలో బుధవారం శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫైలేరియా రోగులకు కిట్లు అందజేత

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమకాటుకు దూరంగా ఉండే మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో 106 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందజేసిన కిట్లను వారు పంపిణీ చేశారు. సరిపల్లె గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి 55 మందికి సుగర్, బీపీ పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు అందజేసినట్లు డా.సంతోష్ తెలిపారు. సీహెచ్‌వో జాలాదివిల్సన్, ఆరోగ్యసహాయకుడు యోహాన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలకు రూ.1.50 లక్షల విరాళం

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.1.50 లక్షలు విరాళాన్ని నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి బుధవారం అందజేశారు. ప్రిన్సిపాల్ డా.టీకే విశ్వేశ్వరరావుకు ఈ చెక్కును అందించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల రెడ్డియ్య, ఐక్యు కోఆర్డినేటర్ డా. కొండా రవి ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సహకారం సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి శ్రీనివాసు పాల్గొన్నారు.

ప్రజలందరి అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆపార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గ్రామగ్రామాన గడపగడపలోనూ ప్రజలు పాలనలో వచ్చిన మార్పును గుర్తించి సీఎం జగనన్నకు మద్దతు తెలుపుతున్నారని ఆయన అన్నారు. బుధవారం రామారావుగూడెంలో సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సర్వే, కిట్ల పంపిణీ చేశారు. అన్ని వర్గాల ప్రజలు సుస్పష్టంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని నాని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం ప్రసాద్, పర్వతనేని నరేంద్ర, గుల్లా శివప్రసాద్, రామకృష్ణ, బాబ్జి, కొత్తపల్లి సుబ్బారావు, గృహసారథులు, వలంటీర్లు, వార్డు మెంబర్లు, నాయకులున్నారు.

ఎంపీటీసీ ఛాంబర్ చైర్మన్‌గా దూసనపూడి


ఎంపీటీసీ ఛాంబర్ సభ్యులను అభినందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

నిడమర్రు: నిడమర్రు మండల ఎంపీటీసీ సభ్యుల ఛాంబర్ చైర్మన్‌గా నిడమర్రు ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణను మండల ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల చాబర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా మజ్జి శ్రీను (అడవికొలను), ముత్యాల సుబ్బలక్ష్మి (బావాయిపాలెం), సెక్రటరీగా కొత్తల సింహాచలం (చానమిల్లి), జాయింట్ సెక్రటరీగా ముదునూరి త్రివేణి (మందలపర్రు), ట్రెజరర్‌గా మర్రిపూడి రత్నకుమారి (తోకలపల్లి)ని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన చాంబర్ సభ్యులు ఆయాగ్రామాలు, మండల అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీలు సమయం వీరరాఘవులు, బండి రమణ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, సర్పంచ్‌లు పొట్నూరి ఉమా, వంజరపు సత్యనారాయణ, ఎంపీటీసీలు బొక్క వెంకటలక్ష్మి, అంబళ్ల కృష్ణకుమారి తదితరులున్నారు .

రాయన్నపాలెంలో ఇంటింటికీ పర్యటన


రాయన్నపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌ను ఇంటికి అతికిస్తున్న గృహసారథులు

పెదవేగి : వాడవాడలా మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు నినాదం మార్మోగుతోంది. పెదవేగి మండలం రాయన్నపాలెం పంచాయతీ పరిధిలో ఉత్సాహంగా పార్టీ శ్రేణులు, గృహ సారథులు బుధవారం రాత్రి పెదవేగి మండలం రాయన్నపాలెంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రతి గడపకీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేకూర్చే లబ్ధి, అందించే పథకాలు ప్రజలకు నాయకులు వివరించారు. జగనన్న ప్రభుత్వ పరిపాలన, పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దాత యండగండి మేడవరహాల రాజుకు సత్కారం

దెందులూరు: విద్య, మౌలిక వసతుల కల్పన, సమాజ సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న యండగండి మేడవరలహారాజు అభినందనీయులని పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ.డేవిడ్, సంఘ పెద్దలు, యువత, గ్రామస్తులు అన్నారు. పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో చర్చి, పాఠశాలలకు ఆర్వో నీటి సదుపాయం, బెంచీలు, కుర్చీలు, పుస్తకాలు అందించి రాజు బుధవారం అందించారు. ఈ సందర్భంగా రాజును శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందించారు.

వ్యభిచార గృహంపై దాడి

పెదపాడు: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులను అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలంలోని తాళ్లమూడిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడిచేసారు. పునుకొల్లు గ్రామానికి చెందిన చిట్టియ్యను, నిర్వహణకు ఇల్లు ఇచ్చిన ఏసుబాబును, సీతారామపురానికి చెందిన సందీప్‌ను, ఓ మహిళను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

గోనె సంచుల కొరత లేదు


కైకరం ఆయకట్టు ధాన్యం కళ్లాలను పరిశీలిస్తున్న అసిస్టెంటు కలెక్టరు అపూర్వ భరత్

ఉంగుటూరు: జిల్లాలో ధాన్యం సేకరణలో సంచుల కొరత లేదని, రవాణా సమస్యలేదని అసిస్టెంటు కలెక్టరు అపూర్వ భరత్ చెప్పారు. కై కరంలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని, కళ్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఇప్పటికే లక్షకు పైగా గోనె సంచులు రైతులకు అందజేశామని తెలిపారు. 11 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. బుధవారం ఒక్కరోజు 30వేల గోనె సంచులు అందించామని చెప్పారు. ధాన్యం రవాణాకుకు వాహనాలు సమకూర్చామన్నారు. ధాన్యం ఎగుమతుల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆర్జేడీ రామకృష్ణ, తహసీల్దారు వెంకట రమణ, ఏవో వెంకట్ పాల్గొన్నారు.